



RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ బుధవారం 31-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 201 పేజీలు : 4 వెల : రూ 2-00


## కుప్పకూలిన వ్యక్తిని ఆదుకున్న ట్రాఫిక్ పోలీసులు

మేడ్చల్ జూలై 30, (న్యూస్ పల్స్) ఉప్పల్ చిలుకానగర్ బస్టాప్ దగ్గర ఒక ప్రయాణికునికి సడన్ గా శ్వాస సమస్య రావడంతో అక్కడినే ఉన్న ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ ఎచ్ ఓ లక్ష్మిమాధవి, ఇన్స్పెక్టర్ సూర్య నాయక్ స్పందించి, సిబ్బందితో అట్టి వ్యక్తిని పోలీస్ వెహికిల్ లో హాస్పిటల్ కు తరలించారు. ఉప్పల్ ట్రాఫిక్ పోలీసు అధికారులు సీఆర్ఎంపి సహాయంతో చిలకానగర్ లో గుంతలను పూడ్చే సమయంలో ఐటీసీ లిమిటెడ్ ఉద్యోగి బీపేష్ గజ్లే అనే వ్యక్తి తన భార్య ఆర్తితో కలిసి మేడిపల్లి నివాసానికి వెళ్తున్నాడు. చిల్కానగర్ బస్ స్టాప్ వద్ద, ఆ వ్యక్తి కుప్పకూలిపోయాడు. ఇన్స్పెక్టర్స్ లక్ష్మి మాధవి, సూర్య నాయక్ లు వెంటనే స్పందించి అట్టి వ్యక్తిని పోలీస్ వెహికిల్ లో హాస్పిటల్ కు చికిత్స కోసము పంపించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాపాయం లేదని చెప్పారు. అత్యవసర పరిస్థితిలో మానవత్వం చాటి స్పందించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్స్ లక్ష్మి మాధవి, సూర్య నాయక్ లను స్థానికులు ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు...

# వయనాడ్ లో విరిగిపడిన కొండచరియలు



తిరువనంతపురం, జూలై 30, (న్యూస్ పల్స్) : కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో పెను విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వందలాది మంది ఇంకా శిథిలాల్లో ఉన్నారు. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై పట్టణం, చురాల్ మాల ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున ప్రకృతి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 50 మృత్యువాత పడ్డారు. ఇంకా వందల మంది శిథిలాల్లో చిక్కుకొని ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ చెప్పినట్టు ఇప్పటి వరకు మృతి చెందినవారిలో ఒక చిన్నారి కూడా ఉన్నట్టు గుర్తించారు. 100 మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు శరవేగంగా సాగుతున్నాయని వీణా జార్జ్ తెలిపారు. చురల్మలా గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. కొండచరియల్లో 400 మంది కుటుంబాలు చిక్కుకున్నాయి. ఘటనాస్థలికి వెళ్లే రోడ్డు మార్గాలు ధ్వంసం అయ్యాయి. వరదలో మృతదేహాలు కొట్టుకువస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. వయనాడ్ లోయ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. కేరళలో భారీవర్షాల బీభత్సం ఎలా ఉందో చూపే దృశ్యమిది. భీకర వర్షాలకు రైల్వేట్రాక్స్ దెబ్బతింటున్నాయి.

### అంతకంతకు పెరుగుతున్న మృతులు



వలతోల్ నగర్, వడకంచెరి మధ్య ఒక రైల్వేలైన్‌మీదకు వరద పోటెత్తింది. దీంతో స్టేషన్ వాచ్‌మన్ రైలును ఆపేశాడు. సహాయక చర్యల కోసం ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. రెండు హెలికాప్టర్లు సహాయకచర్యలకు బయల్దేరాయి. మరోవైపు కేరళ అఓ పినరయ్ విజయన్ సహాయచర్యలను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఈ దారుణ ఘటనలో వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ బాధిత ప్రాంతంలో ఫైర్ ఫోర్స్ , ఔఆఖీఈ బృందాలను మోహరించినట్లు తెలిపింది. అలాగే ఎన్డీఆర్ఎఫ్ మరో బృందం వాయనాడ్ చేరుకుంది. సైన్యం కూడా బాధ్యతలు చేపట్టింది. సహాయక చర్యలు శరవేగంగా జరుగుతున్నాయి.

మోదీ భరోసా

వయనాడ్‌లో జరిగిన దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం అందజేయనున్నట్టు ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కేరళలో కొండచరియలు విరిగిపడిన ఘటన తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రస్తుతం బాధితులందరినీ ఆదుకునేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో మాట్లాడానని, అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పరిహారాన్ని కూడా ప్రధాని మోదీ ప్రకటించారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామన్నారు. క్షతగాత్రులకు రూ.50వేలు పరిహారం అందజేస్తామన్నారు.

రాహుల్ గాంధీగ్భ్రాంతి

కేరళలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'వయనాడ్‌లోని మెప్పాడి సమీపంలో కొండచరియలు విరిగిపడటం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆత్మీయులను




కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అన్నారు. ఇంకా శిథిలాల్లో చిక్కుకుపోయిన వారిని త్వరలోనే సురక్షితంగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళ ముఖ్యమంత్రి, వయనాడ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, సహాయక చర్యలకు అవసరమైన సహాయం గురించి తెలియజేయాలని కోరారు. కేంద్రమంత్రులతో మాట్లాడి వయనాడ్‌కు అన్ని విధాలా సాయం అందించాలని కోరతాను అన్నారు. సహాయక చర్యల్లో అధికార యంత్రాంగానికి సహకరించాలని యూడీఎఫ్ కార్యకర్తలందరికీ రిక్వస్ట్ చేశారు.

భారీ వర్షాల ముంచెత్తడంతో ముండక్కై పట్టణంలో తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మొదట కొండచరియలు విరిగిపడ్డాయి. అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న టైంలోనే చురల్ మాలలో మరో ప్రమాదం జరిగింది. సుమారు 4 గంటల ప్రాంతంలో చురల్ మాలలోని పాఠశాల సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వరదబాధితుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంతోపాటు సమీపంలోని ఇళ్లు, దుకాణాలన్నీ నీరు, బురదతో నిండిపోయాయి.

హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు

బాధితుల కోసం 9656938689, 8086010833 హెల్‌లైన్‌లు ఏర్పాటు చేసింది కేరళ ప్రభుత్వం. అన్ని విధాల ప్రజలకు ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.

# రెండో విడుత రైతు రుణమాఫీ నిధులు విడుదల



హైదరాబాద్ : అసెంబ్లీ ప్రాంగణంలో రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండో విడుత రుణమాఫీ నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రూ. లక్షా నుంచి రూ. లక్షా యాభై వేల లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. రెండో విడతలో 6.4 లక్షల మంది రైతులకు రూ. 6,190 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. తొలి విడుతలో 11.34 లక్షల మంది రైతులకు రూ. 6,035 కోట్లు జమ చేశారు. రుణమాఫీ ద్వారా ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరినట్లు పేర్కొన్నారు. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ. 12,225 కోట్లను జమ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రెండు విడతల్లో అత్యధికంగా నల్లగొండ జిల్లాకు రూ. 984.34 కోట్లు విడుదల చేశారు. ఈ రెండు విడతల్లో నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1,37,430 మంది రైతులు లబ్ది పొందారు. నల్లగొండ జిల్లా తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది. రెండో స్థానంలో నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు విడతల్లో 80,395 మంది రైతులు లబ్ది పొందగా, రూ. 583.87 కోట్లు విడుదల చేశారు. మూడో స్థానంలో సంగారెడ్డి జిల్లా నిలిచింది. ఈ జిల్లాకు రూ. 563.99 కోట్ల నిధులు విడుదల చేయగా, 77,951 మంది లబ్ది పొందినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ములుగు జిల్లాలో 17,788 మంది రైతులకు రూ. 130.94 కోట్లు కేటాయించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో రెండు విడతల్లో రూ. 15.56 కోట్లు విడుదల చేసి 2,799 మందికి లబ్ది చేకూర్చారు. ఇక చివరి స్థానంలో నిలిచిన హైదరాబాద్ జిల్లాలో కేవలం ఏడుగురు రైతులు మాత్రమే లబ్ది పొందారు. తొలి విడతలో ముగ్గురు, రెండో విడతలో నలుగురు రైతులకు లబ్ది చేకూరింది.

# త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ : ప్రధాని మోదీ




న్యూఢిల్లీ: 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అప్పులపై వాడీవేడి చర్చ...

### బీఆర్ఎస్ పై భట్టి మండిపాటు

హైదరాబాద్, జూలై 30 , (న్యూస్ పల్స్) తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడి వేడిగా సాగుతున్నాయి. ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తుండగా, అంతే స్థాయిలో అధికార పార్టీ కూడా ప్రతి స్పందిస్తోంది. ఆరోపణలు ప్రత్యారోపణలతో సభ వాడివేడిగా సాగుతోంది. ఈ క్రమంలోనే సోమవారం నిర్వహించిన శాసనసభ సమావేశాలు ఆసక్తికరంగా సాగాయి. ఉదయం 10 గంటలకు మొదలైన శాసనసభ అర్ధరాత్రి 1.30 గంటల వరకు కొనసాగింది. బడ్జెట్ పద్దులపై అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన చర్చలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న కీలక నిర్ణయాలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అడ్డగోలు వ్యవహారాలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా అదనపు విద్యుత్ ఉత్పత్తి, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై భట్టి విక్రమార్క తనదైన శైలిలో విమర్శలను గుప్పించారు. పదేళ్ల పాలనలో అదనపు విద్యుత్ ఉత్పత్తిని చేపట్టని భారతీయ రాష్ట్ర సమితి సర్కారు.. రాష్ట్రంపై మాత్రం అప్పులు భారాన్ని మోపిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఉత్పాదన తమ ఘనతగా చెప్పుకొని రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించిందంటూ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉత్పత్తి సరఫరా మెరుగుపడినట్లు భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఆరోపించారు. యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టు పేరుతో ఏటా 30 వేల కోట్ల రూపాయల భారాన్ని అప్పటి భారతీయ రాష్ట్ర సమితి ప్రభుత్వంపై మోపిందన్నారు. ప్రాజెక్ట్ నుంచి ప్లై యాస్ తరలించేందుకు సరైన రవాణా సౌకర్యం కల్పించలేని దుస్థితి ఏర్పడిందని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు భట్టి ఈ సందర్భంగా సభలో వెల్లడించారు. యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టుపై ఎన్జీటీ 2022లో నిషేధం విధించిందని, అప్పటి కెసిఆర్ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకుండానే చేతులెత్తేసిందని, దీనికి కారణం ఏమిటో చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాజెక్టును చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు అప్పటి సర్కారు ప్రయత్నించిందని విమర్శించారు. ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక కేటాయింపులు చేసిందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ జ్యోతిని అమలు చేస్తామని స్పష్టం చేశారు. బ్రాహ్మణ పరిషత్తుకు తగినన్ని నిధులు కేటాయిస్తామన్న భట్టి విక్రమార్క.. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు అర్హత నిష్పత్తిని 1:100 చేయాలన్న విజ్ఞప్తులు ప్రభుత్వం దృష్టికి వచ్చాయన్నారు. నోటిఫికేషన్ సమయంలోనే అర్హత ప్రాతిపదికను 1:50గా నిర్ణయించినందున ఎవరైనా కోర్టుకు వెళితే సమస్యలు ఎదురై పరీక్ష ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే తాము నిర్ణయం తీసుకోలేకపోతున్నామని భట్టి పేర్కొన్నారు.

## రైతులు పంటలకు కనీస మద్దతు ధర కావాలని అడుగుతున్నారు..


### రాహుల్ గాంధీ

ఢిల్లీ, బడ్జెట్‌లో రైతులకు కనీస మద్దతు ధర ప్రస్తావన లేదు. రైతులకు ఇప్పటివరకు స్పష్టమైన హామీ లభించలేదు. రైతు సంఘాల నేతలతో మాట్లాడేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. కేంద్ర ప్రభుత్వం మధ్య తరగతి ప్రజలను పట్టించు కోవడం లేదు. బడ్జె ట్‌లో మధ్య తరగతి ప్రజలను విస్మరిం చారు. మధ్య తరగతి ప్రజలు ఇండియా కూటమికి మద్దతు తెలుపుతు న్నారు. ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇవ్వలేని పరిస్థితి. అదానీ, అంబానీలకే మేలు చేసేలా కేంద్ర నిర్ణయాలు ఉన్నాయి. రాహుల్ గాంధీ అన్నారు.



## విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్‌గా జస్టిస్ లోకూర్

హైదరాబాద్ : విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్ రావు లోకూర్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైకోర్టు సీజేగా ఆయన పని చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కూడా జస్టిస్ లోకూర్ సేవలందించారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తప్పుకున్న సంగతి తెలిసిందే. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన కమిషన్ నుంచి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు జస్టిస్ నరసింహా రెడ్డి లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయం ఇచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించొచ్చని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ లోకూర్‌ను ప్రభుత్వం నియమించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డితో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ విచారణను సవాల్ చేస్తూ కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు జులై 16న ఉదయం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల తరపున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా, కేసీఆర్ తరపున ముకుల్ రోహత్గీ వాదించారు.



# సంపాదకీయం

బుధవారం 31-07-2024

## వరద నీటిని ఒడిసి పట్టేది ఎన్నడూ....

దేశంలో అతివృష్టి లేకుంటే అనావృష్టి. నిన్నమొన్నటి వరకు రుతుపవనాలు కోసం నిరీక్షించి విసిగిపోగా ఇప్పుడు ఎడతెరిపిలేని కుంభవృష్టితో మునిగితేలవలసి వస్తోంది. గత కొన్ని రోజులుగా అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ , హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలు వర్షాల బీభత్సాన్ని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్రలో గత వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రాణనష్టం, ఆస్తుల నష్టం సంభవిస్తోంది. 2019లో రుతుపవనాల వల్ల వచ్చే భారీ వర్షాలు, వరదల కారణంగా దేశం మొత్తం మీద రూ. 57,000 కోట్ల వరకు నష్టం ఏర్పడగా, ఒక్క తమిళనాడులోనే రూ. 26,000 కోట్ల వరకు నష్టం జరిగింది. దాదాపు 13 రాష్ట్రాలు వరద నీటిలో తేలియాడాయి. ఇంత జరిగినా వరద నీటిని మళ్లించి పదిలపర్చుకునే విధానాలు దేశంలో లేకపోవడం పెద్దలోపం. కుంభవృష్టితో రిజర్వాయర్లలో నీరు ప్రమాదస్థాయి దాటిపోతుండడంతో గేట్లు బార్లాతెరిచి వరదనీటిని బయటకు పంపవలసి వస్తోంది. ఆ నీరంతా వృథాగా సముద్రం పాలవుతుందే తప్ప నిల్వ చేసుకోలేకపోతున్నాం.స్తారంగా వానలు కురిశాయి. గోదావరి ఉప్పొంగి ప్రవహించింది. అయినా నీటి వనరులు పూర్తి స్థాయిలో నిండలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోసినప్పటికీ భవిష్యత్తులో ఎలా ఉ ంటుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. ఈ సీజన్‌లో నీటి వనరులు పూర్తి స్థాయిలో నిండి ఉంటే వానాకాలం సీజన్ పంటలపై ధైర్యంగా ఉండే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.మళ్లీ వేసవిలో నీటి వనరులు ఎండిపోయి అల్లాడిపోవలసి వస్తోంది. ఇప్పుడు భారీగాచేరుతున్న వరద నీటిని నిల్వచేసుకోలేమా? ఈ మేరకు ప్రభుత్వాలు ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదు? అన్న ప్రశ్నలు వెంటాడుతున్నాయి. దేశం లో నాలుగు మాసాల వ్యవధిలో 80% వర్షపాతం ద్వారా నీరు సమకూరుతుంది. అయితే వాతావరణ మార్పుల వల్ల రుతుపవనాల సమయంలో చాలా తక్కువ వ్యవధిలో ఎడతెరిపిలేని వర్షపాతం సంభవించి వరదలు ముంచెత్తుకు వస్తున్నాయి. జులై 25 వరకు వరద ప్రవాహం రిజర్వాయర్లలో ఎంత చేరిందో ఎంత బయటకు వృథాగా సముద్రం పాలయిందో పరిశీలిస్తే చాలా వరకు నీటిని ఆదా చేసుకోలేకపోతున్నామన్న ఆవేదన కలగక మానదు. ఉ దాహరణకు గోదావరిలో ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు నుంచి భారీగా ప్రవాహం రావడంతో ధవళేశ్వరం నుంచి 13.17 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెట్టవలసి వచ్చింది. 24 వతేదీ వరకు 393 టిఎంసిలు సముద్రం లోకి చేరగా, 25వ తేదీ నాటికి మరో 125 టిఎంసిలు సముద్రం లోకి చేరాయి. తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తి 18,746 క్యూసెక్కుల నీటిని బయటకు విడిచిపెట్టారు. సెంట్రల్ వాటర్ కమిషన్ డేటా ప్రకారం ప్రాజెక్టుల ద్వారా నీటి నిల్వ సామర్థం 257 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బిఎంసి) నుంచి 325 బిలియన్ క్యూబిక్ మీటర్ల వరకు ఉంటోంది.సగటు వార్షిక వర్షపాతం 3880 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా పరిగణిస్తే దాదాపు 2000 బిలియన్ క్యూబిక్ మీటర్ల వరకు వర్షపాతం నీరు నిల్వకాకుండా వృథాగా పోతోంది. దాదాపు 50 ఏళ్ల తరువాత ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో గత మార్చిలో ప్రపంచ నీటి సదస్సులో ప్రాజెక్టుల బలోపేతం పైన, నీటి నిల్వపైన చర్చలు జరిగాయి. నీటి సంరక్షణ, భద్రతపై అమలు చేయాల్సిన కార్యాచరణ పైనా భారత్‌తోపాటు దాదాపు 164 దేశాల ప్రభుత్వాలు ప్రతిపాదనలు సమర్పించాయి. మరి ఈ ప్రతిపాదనలు ఎంతవరకు కార్యాచరణలోకి వస్తాయో ఆలోచించాల్సిందే. భారీ వర్షాల వల్ల ముంచుకొచ్చిన వరద నీటిని క్రమబద్ధీకరించి నిల్వ చేసుకునే ఏర్పాట్లు లోపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 'నీటిని పదిలపరుచు సద్వినియోగించు' అనే లక్ష్యాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించక తప్పదు. వర్షాలు, వరదల వల్ల తీర మైదానాలు రీఛార్జి అవుతుంటాయి. అలా రీఛార్జి అయ్యే నీటి కన్నా ఎక్కువగా తోడేస్తే అవి మురికి నీళ్లుగా మారతాయి.అత్యంత విలువైన జలసిరి నశించక తప్పదు. నగరాలు, పట్టణాల్లో, పరిశ్రమల్లో వ్యవసాయంలో అవసరాలకు మించి నీటిని విచక్షణారహితంగా తోడేయడంతో నదులు ప్రవాహం తగ్గి క్షీణిస్తున్నాయి. ఉ దాహరణకు తమిళనాడులోని తమిళ బరణి నది తిరునల్వేలి, తూతుకుడి, నగరాల మీదుగా 100 కిమీ పొడవునా ప్రవహిస్తోంది. ఈ రెండు నగరాల జనాభా మిలియన్‌కు పైగా ఉంటుంది. రోజుకు ఒక్కొక్కరికి తలసరి 100 లీటర్ల నీరు అవసరం అవుతుంది. నది ఒడ్డున కట్టడాల ప్రాంతాన్ని మినహాయిస్తే 75 కిమీ వరకే నది ప్రవహిస్తోంది. నదికి రెండు వైపులా కిలోమీటరు పరిధిలో స్వచ్ఛమైన నీటిని పదిలం చేయవచ్చు.ఈ నదీ ప్రవాహప్రాంతం (75కిమీ) 50% వరకు వాన నీటిని గ్రహిస్తుంది. అంటే ఏటా 100 సెం.మీ వంతున వర్షపాతాన్ని గ్రహిస్తుందని చెప్పవచ్చు. రుతుపవనాల సమయంలో వరదకు నీటిమట్టం 4 మీటర్ల వరకు పెరిగి ప్రవాహ ప్రాంత మైదానంలో 3 మీటర్ల లోతున నీరు ఇంకుతుంది. దీని వల్ల 15 నుంచి 50% పరిమాణంలో నీటి లభ్యత చేకూరుతుంది. ఈ విధంగా పట్టణ అవసరాలకు ఈ నీరే ఉపయోగపడుతుంది. కానీ ప్రవాహమైదానంలో కట్టడాలు అక్రమంగా పుట్టుకొస్తున్నాయి.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సూపరిండెంట్ ఎవరు...?


- గత 5 సంవత్సరలుగా ఒకటే నంబర్.......
- ఫోన్ చేస్తే లిఫ్ట్ చేసేది మాత్రం ఆ... మెగాస్టారే....
- ఇంతకు ఆ మెగాస్టార్ ఎవరు...?
- ప్రభుత్వ ఉద్యోగస్తుడా.....?
- లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగా....?
- లేక వేరేశాఖకు చెందిన వాడా...?
- సూపరెండేంట్ నంబర్ ఇతని దగ్గర ఎలా...?








నిజామాబాద్ , జులై 29 (లోకంతీరు) : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏమి జరుగుతుందో ఎవరికి అర్థము కావడం లేదు..ఆసుపత్రిలో రెగులర్ ఉద్యోగులు ఎంత మంది పని చేస్తున్నారు. ..? అవుట్ సోర్సింగ్ క్రింద ఎంత మంది పని చేస్తున్నారు..? ఆసుపత్రిలో మొత్తం అన్ని విభాగాల్లో ఎంతమంది పనిచేస్తున్నారు..? వీరికి బాస్..మేడమా లేక ..ఆ మెగాస్టారా అర్థము కావడం లేదు. ఈ ప్రభుత్వాసుపత్రిలో అన్ని ఆయననే చూసుకుంటాడు. కరోన సమయంలో కూడా ఫోన్ చేస్తే " మేడమ్ బిజీగా ఉన్నారు తర్వాత ఫోన్ చేయండి అని సమాధానం ఇచ్చేవాడు" విషయం ఏమిటంటే సూపరెండేంట్ నంబర్ ఇతనికి ఎవరు కేటాయించారు..ప్రస్తుతం కూడా అదే నంబర్ ఎలా కొనసాగిస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు తీర్చడానికి సెల్ఫోన్ సౌకర్యం కల్పించింది కానీ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో మాత్రం సూపర్ ఇండెంట్ కు కేటాయించిన నంబరు ఎవరు రిసీవ్ చేసేది...ఎవరు మీరు ఎవరూ అని అడిగితే నేను మేడం పిఏ ని , మీకేం పని కావాలి అని ఎదురు సమాధానం ఇస్తూ ఉంటాడు. మీకు ఏదైనా అవసరం ఉంటే నన్ను అడగండి మేడం గారికి చెబుతాను అంటాడు. కానీ ఇతను ఎవరు మేడం పీఏనా.. ప్రభుత్వ సూపరిమెంట్ పర్సనల్ అసిస్టెంట్ టా లేక ప్రభుత్వం నియమించిన ప్రభుత్వ ఉద్యోగా ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. కానీ అన్ని తానై చూసుకుంటాడు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ సేవా అవార్డులు కూడా తీసుకున్నాడు అంటే ఇతను ఎంత గొప్ప మహానటుడు మెగా స్టార్ అయి ఉండవచ్చు అని ఆసుపత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇతనికి ఆసుపత్రికి ఎటువంటి సంబంధాలు లేకపోయినా ఉత్తమ ప్రశంస పత్రాలు ఏ క్యాడర్ క్రింద కేటాయించారో.. అటు అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు అంతుచిక్కని సమాధానం గా మారింది. ఈ మెగాస్టార్ అన్ని తనై చాలా చాకచక్యంగా ఉంటూ అన్నిటినీ మూట కట్టుకుంటాడు ఇంతకీ ఇతను ఎవరు. ఇతని వృత్తి ఏమిటి.....?



## సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన...- వైద్యాధికారి డాక్టర్ సుప్రియ





వేల్పూర్, జులై 30 (లోకంతీరు) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది చేస్తున్న సర్వే ను వైద్యాధికారి డాక్టర్ సుప్రియ పర్యవేక్షించారు ముఖ్యంగా ఈ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.ముఖ్యంగామలేరియాడెంగ్యూచికెన్ గున్యా మొదలగునవి వ్యాపిస్తాయని ఆమె తెలిపారు కావున ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు కావున ప్రతి శుక్రవారం రోజు ఫ్రైడే గా పాటించాలని ఆమె తెలిపారు వాడిన కూలర్లను శుభ్రం చేసుకోవాలని ఇంటి చుట్టుపక్కల పరిసరాలను ఎల్లవేళలా శుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా దోమలను అరికట్ట వచ్చిన ఆమె తెలిపారు అదే విధంగా ఈ వర్షాకాలంలో ప్రజలు బయట తినుబండారాలను తినకూడదని ఇంటిలోనే తాజా ఆహారాన్ని గురించి ఆమె తెలిపారు దీని ద్వారా డయేరియా డీసెంట్రీ టైఫాయిడ్ మొదలగునవి రాకుండా చూసుకోవచ్చని ఆమె తెలిపారు ఈ ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ ఏఎన్ఎం గీత పాల్గొన్నారు

# పండుగ వాతావరణంలో రైతు రుణమాఫీ మలివిడత నిధుల విడుదల

- కలెక్టరేట్ లో రైతులకు లాంఛనంగా చెక్కుల అందజేత






కామారెడ్డి జిల్లా, జూలై 30 (లోకంతీరు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ-2024 మలివిడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయం ఆవరణ నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేయగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కామారెడ్డి కలెక్టరేట్లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన లబ్దిదారులైన రైతులు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. జిల్లాలోని 25 రైతు వేదికలలోనూ రుణ మాఫీ మలివిడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగగా, ఎక్కడికక్కడ రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ, సంబురాలు జరుపుకున్నారు. ఒకే పంటకాలంలో రూ. రెండు లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ లబ్దిదారులైన పలువురు రైతులకు రెండవ విడత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను లాంఛనంగా అందజేశారు. రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాలలో రూ. 31 వేల కోట్లు జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 18న లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేయగా, మలివిడతగా ప్రస్తుతం లక్షా 50 వేల రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో49540 మంది రైతు కుటుంబాలకు రూ. 231 కోట్ల మేర లబ్ది చేకూర్చగా, మలివిడతలో 24816 మంది రైతు కుటుంబాలకు రూ. 211 కోట్ల నిధులను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయినప్పటికీ ఎక్కడైనా క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ విషయంలో ఇబ్బందులు ఉంటే, వాటిని పరిష్కరించేందుకు వీలుగా జిల్లా స్థాయిలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇప్పటికే తొలివిడత మాఫీకి సంబంధించి 1209 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. సహాయక కేంద్రాన్ని సంప్రదించేందుకు వీలుపడని రైతులు నేరుగా7288894616, 7288894600 నెంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన మలివిడత రుణమాఫీ నిధులను రెండు రోజుల్లోపు రైతుల ఖాతాలలో అందుబాటులో ఉండేలా చూడాలని, వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునే విధంగా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. తొలి, మలివిడతలలో రుణమాఫీ పొందిన రైతులందరికీ జిల్లా యంత్రాంగం తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,, లీడ్ బ్యాంకు మేనేజర్, రవికాంత్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు



కామారెడ్డి జిల్లా,జూలై 30 ( లోకంతీరు ) : కామారెడ్డి జిల్లాలోని రాజంపేట మండలంలోని18 గ్రామపంచాయతీల కార్మికులను ముందస్తు గా మంగళవారం రాజంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది అరెస్ట్ చేసారు. నేడు చలో హైదరాబాద్ ముట్టడిలో భాగంగా రాజంపేట పోలీసు స్టేషన్ పరిధిలోని 18 గ్రామపంచాయతీల 60 మంది గ్రామ పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లో నిర్బంచారు. జిపి కార్మికులకు సరియైన భీమా భద్రత, జీతాలు అందించాలని వారు నేడు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టారు.

# ప్రజాప్రభుత్వంలో రైతు రుణమాఫీ దేశచరిత్రలోనే రికార్డు

- తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు : వెంకటేష్ గౌడ్




బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, జూలై 30 (లోకంతీరు) : బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ మంగళవారం రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీ ప్రక్రియ లో భాగంగా రూ.1.50 లక్షలు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారత చరిత్రలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం తలపెట్టలేనంత పెద్ద మొత్తంలో రైతులకు రుణమాఫీ చేస్తూ తెలంగాణ ప్రజాప్రభుత్వం రికార్డు నెలకొల్పిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.తొలి విడతలో రూ.1లక్షలోపు రుణాలు మాఫీ, రెండో విడతలో రూ.1.50లక్షల లోపు రుణాల మాఫీ కింద 12 రోజుల వ్యవధిలోనే లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.12,224 కోట్లను జమ చేశామని ముఖ్యమంత్రి ప్రకటించారని,మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి రుణమాఫీ నిధులు జమ అయ్యే ప్రక్రియ ప్రారంభమైందని,మాట ఇచ్చిన విధంగా ఆగస్టులోనే మూడో విడత చేపట్టి మొత్తం రూ.31వేల కోట్ల రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి తెలిపారని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రం కూడా ఇంత స్వల్ప వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో రైతులకు రుణమాఫీ చేయలేదని, ఆ ఘనత తెలంగాణ ప్రజాప్రభుత్వానికే దక్కడం గర్వంగా ఉందన్నారు.అన్నదాతలు బాగుండాలన్నదే కాంగ్రెస్ పార్టీ విధానమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతాంగం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ వెల్లడించారు.ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు సంజీవ్ గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు జావీద్, యూనుస్,కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జుక్కల్ ఎమ్మెల్యే ను కలిసిన జిల్లా నాయకులు



కామారెడ్డి జిల్లా, జూలై 30 (లోకంతీరు ) : జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ను హైదరాబాద్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్ లో కామారెడ్డి జిల్లా ఏం ఆర్ పి ఎస్ నాయకులు మంగళవారం శాలువా కప్పి పూల బోకే ఇచ్చి సన్మానం చేశారు. మాదిగ రాజకీయ పోరాట సమితి( ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరు భాగయ్య మాదిగ, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న మాదిగ, కొత్తూరు గంగయ్య మాదిగ, జుక్కల్ ఎమ్మెల్యేను సన్మానించారు.

## అవగాహన సామర్థ్యాన్ని పెంపొందించాలి
### బాల్కొండ ఎంఈఓ బట్టు రాజేశ్వర్





బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి , జులై 30 ( లోకంతీరు ) : బాల్కొండ మండల కేంద్రంలో విద్యార్థులలో అవగాహన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు భాషను బోధించే ఉపాధ్యాయులు కృషి చేయాలని బాల్కొండ మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ కోరారు. మంగళవారం నాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండలో నిర్వహించిన తెలుగు ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పిల్లలు ధారాళంగా చదివి, విషయాన్ని అవగాహన చేసుకుంటే వారు ఇతర సామర్థ్యాలైనా స్వీయ రచన సృజనాత్మకత వ్యాకరణ అంశాలలోను మెరుగ్గా రాణిస్తారని వాటన్నిటికీ మూలమైన అవగాహన ప్రతిస్పందన సామర్థ్యం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. నవంబర్ మాసంలో జరిగే నేషనల్ అచీవ్మెంట్ సర్వేకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ ఘనపురం దేవేందర్, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ నాగుల రాజేందర్ గౌడ్, కాంప్లెక్స్ కార్యదర్శి శ్రీలక్ష్మి బాల్కొండ ఆర్మూర్, ముప్కాల్, మెండోరా, ఆలూరు మండలాల చెందిన తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాంప్రభు, సౌద రవి, వివేకవర్ధన్,హారతి, అహల్య, బోచ్కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బేషరుతగా అందరికి రుణమాఫీ చెయ్యాలి



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, జులై 30 ( లోకంతీరు ) : భారతీయ జనతా పార్టీ మండల కిసాన్ మోర?చ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చినా హామీ మేరకు ఏకా కాలంలో ప్రతీ రైతుకు 2 లక్షల ఋణ మాఫీ,ప్రతి రైతుకూ ఇస్తామన్న రైతు కూలీలకు 12000 రూపాయలు మరియు కౌలు రైతులకు ఇస్తామన్న 15000 రూపాయలు బేషరతుగా అమలు చేయాలని,ప్రతి ఒక్క రైతుకు రుణ మాఫీ అందరికీ జరిగేలా చూడాలని వేల్పూర్ మండల తహసీల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఒకవేళ ఇవ్వని యెడల ఈ కార్యక్రమాన్ని ఉదృతం చేస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో బాల్కొండ అసెంబ్లి కన్వీనర్ మల్కన్నగారి మోహన్, కిసాన్ మోర?చ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల నగేష్, వేల్పూరు మండల ప్రధాన కార్యదర్శి దురాజీ రవి పటేల్, కిసాన్ మొర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు నిమ్మల పెద్దన్న, బద్దం సుభాష్, ప్రశాంత్, విఘ్నేష్,శ్రీను యాదవ్, రమేష్ రెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేల్పూర్ లో డీజేలు నిషేధం.- వీడీసీ తీర్మానం.




బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, జులై 30 ( లోకంతీరు ) : వేల్పూర్ మండలం కేంద్రంలో జూలై 30 సెప్టెంబర్ లోజరిగే వినాయక ఉత్సవాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగే డీజేలను పెట్టరాదని వేల్పూర్ గ్రామ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. మంగళవారం వివిధ కుల సంఘాల యూత్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విడిసి అధ్యక్షుడు విజేయ్ మాట్లాడుతూ,ఇతరులకు ఇబ్బంది కలిగించే డీజేలను వాడరాదని, తక్కువ పోల్యూషన్ ఉన్న డిజే లనే ఉపయోగించాలి, అలాగే అర్ధ నగ్నంగా డ్యాన్స్ చేసే వారిని సంప్రదించవద్దు, బలవంతపు చందాలు వసూలు చేయరాదని, భక్తి శ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించాలని విడిసి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో విడిసి సభ్యులు సంఘంలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

కామారెడ్డి జిల్లా , జూలై 30 ( లోకంతీరు ) : ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులకీ అవగాహన సదస్సు నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ లో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా పోలీస్ విభాగం, కామారెడ్డి పోలీస్ కళాబృందం, సాధన సంస్థల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కానిస్టేబుల్ రాజేందర్ మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా అనేది భారతదేశంలో మూడవ అతిపెద్ద వ్యాపారంగా ఉందని మనుషులను అక్రమ రవాణా చేసి ఈ రకాల కార్యక్రమాలకు వివిధ రాష్ట్రాలకు, వివిధ దేశాలకు అమ్మేస్తారని, మనం జాగ్రత్తగా ఉండకపోతే, మనం అమాయకంగా ఉన్నట్టయితే అక్రమ రవాణా గురి అయ్యేటటువంటి అవకాశాలు ఉన్నాయన్నారు. అపరిచిత వ్యక్తులు ఎటువంటి తిను బండారాలు ఇచ్చిన వాటిని తినకూడదని, అలాగే ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్టుగా తెలిస్తే వెంటనే పోలీస్ వారిని సంప్రదించాలని తెలియజేసారు. అనంతరం సాధన సంస్థ కో ఆర్డినేటర్ కొప్పుల రవి మాట్లాడుతూ పిల్లలు అక్రమ రవాణాకు గురయ్యేటటువంటి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అక్రమ రవాణాకు గురైనటువంటి పిల్లల సంఖ్య రోజురోజుకు ఎక్కువవుతుందని, మనం అపరిచిత వ్యక్తులతో మాట్లాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధన సంస్థ బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, పిల్లలపై హింస వేధింపులు అనే అంశాల పై కామారెడ్డి నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తుందన్నారు. చైల్డ్ మ్యారేజ్ గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు అమ్మాయికి 21 సంవత్సరాలలోపు అబ్బాయికి పెళ్లి చేయడం చట్ట ప్రకారం నేరం. అలా పెళ్లి చేసినట్లయితే తగిన చర్యలు తీసుకోబడతాయి. పెళ్లికి హాజరైన ప్రతి ఒక్కరి పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేసారు. అటువంటి సమాచారం ఏమైనా తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా



పోలీస్ 112 లేదా 100 కి కాల్ చేసి సమాచారం అందించగలరని తెలిపారు. అనంతరం కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందం కానిస్టేబుల్ ప్రభాకర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ వలన జరుగుతున్నటువంటి ప్రమాదాల బారి నుండి ఎలాగా మనల్ని మనం కాపాడుకోవాలనే విషయాలని విద్యార్థులకు చెప్తూ సమాజంలో మూఢనమ్మకాలు ఎక్కువ అవుతున్నందున ఆ మూఢనమ్మకాలను ఏ విధంగా నమ్మకూడదో కొన్ని ఉదాహరణలు ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. అలాగే తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కాలేజి ఇంచార్జ్ ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ ప్రపంచ మానవ అక్రమ రవాణా రోజున మా పాఠశాల కళాశాలలో ఇక నిర్వహించి మా విద్యార్థులకు అవసరమైన విషయాలపై అవగాహన కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ మా పిల్లలు అన్ని విషయాలు చురుగ్గా ఉంటారని, ఇటువంటి విషయాలలో చాలా జాగ్రత్తగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఏ హెచ్ టి యు రాజేందర్, పోలీస్ కళాబృందం కానిస్టేబుల్స్ ప్రభాకర్, సాయిలు, సాధన సంస్థ కోఆర్డినేటర్ కొప్పుల రవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సోషల్ వర్క్స్ స్టూడెంట్స్ అలాగే విద్యార్థినిలు, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

# నవచరిత్రను సృష్టించిన నికోలస్ మదురో..!

వెనిజులా విప్లవ వేగుచుక్క..!
జె.జె.సి.పి. బాబూరావు రీసెర్చ్ స్కాలర్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 30 (లోకంతీరు) : హ్యూగో చావెజ్ రాజకీయ వారసుడు, వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో వరుసగా మూడవసారి గెలుపొంది నవచరిత్రను సృష్టించారు. వెనిజులాలో గత ఆదివారం అధ్యక్ష ఎన్నికలను నిర్వహించి 80 శాతం ఓట్లను లెక్కించగా నికోలస్ మదురో 51.20 శాతం ఓట్లు సాధించి మూడవసారి అధ్యక్షుడుగా ఘన విజయం సాధించడం లాటిన్ అమెరికాలో విశిష్ట ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కారకాస్‌లోని శ్రామిక తరగతి..!రోమన్ కాథలిక్ కుటుంబంలో జన్మించిన నికోలస్ మదురో ఒక సాధారణ బస్ డ్రైవర్ ఉద్యోగి నుండి అంతిమంగా దేశ అధ్యక్షుడుగా ను ఎన్నిక కావడమే కాకుండా మూడు సార్లు అధ్యక్షుడుగాను హ్యాట్రిక్ సాధించడం అనన్య సామాన్యం. సామ్రాజ్యవాద దేశాలు మినహా మిగతా అన్ని దేశాల ప్రజానీకం ఆయనకు అభినందనల సందేశాలతో ముంచెత్తడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. 'శాంతి మరియు చట్టం పట్ల గౌరవం ఉంది. దేశంలో శాంతి, సుస్థిరత, దేశ సార్వభౌమత్వ పరిరక్షణలను వెనిజులా దేశ ప్రజానీకం కోరుకుంటుంది. ఆ దిశగా మరింతగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది' అని మూడవసారి అధ్యక్షుడుగా విజయం సాధించాక నికోలస్ మదురో పేర్కొనడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో..!పది మంది దాకా అధ్యక్ష పదవికి పోటీ నెలకొన్నప్పటికీ ప్రధాన పోటీ నికోలస్ మదురో మరియు యూనిటరీ డెమొక్రటిక్ ప్లాట్‌ఫామ్‌కు చెందిన ఎడ్మండో గొంజాలెజ్ మధ్యన కొనసాగింది. నికోలస్ మదురో ప్రధాన ప్రత్యర్థి అయిన ఎడ్మండో గొంజాలెజ్‌కి కేవలం 44.02 శాతం ఓట్లు లభించడం గమనార్హం. అంతర్జాతీయ పరిశీలకుల పర్యవేక్షణలో వెనిజులా అధ్యక్ష ఎన్నికలు సజావుగా జరిగిననూ ఎన్నికల లెక్కింపులో భారీగా అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేయడం అసహేతుకతకు నిదర్శనం కాగలదు.ఈ ఎన్నికల ఫలితాలను విశ్లేషించి చూస్తే..!వెనిజులాలో గత 25 ఏళ్లుగా కొనసాగుతున్న సోషలిస్ట్ పాలనను ప్రజలు కొనసాగించాలి' అని కోరుకోవడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు. ఏది ఏమైననూ అమెరికా కుట్రాజకీయాలతో మిలాఖత్ కాబడి అనేక అడ్డంకులు సృష్టించిననూ ప్రజలు వాటన్నింటిని నిలువరించి మూడోసారి కూడా నికోలస్ మదురోని అధ్యక్షుడుగా ఎన్నుకోవడం 'వెనిజులా రాజకీయాలలో చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులు ఎన్ని కుట్రలకు పాల్పడిననూ బొలివేరియన్ విప్లవ స్ఫూర్తిని తుదముట్టించలేరు. వెనిజులాలో బొలివేరియన్ విప్లవ స్ఫూర్తి కలకాలం వర్ధిల్లుతూనే ఉంటుంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు

# బాల్కొండ లో ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు జిల్లా కలెక్టర్








బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి , జులై 30 ( లోకంతీరు ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజా పాలన లో పథకాలను ప్రతి ఒక్కరికి అందించేలా మండల అధికారులు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించి దరఖాస్తులను ఆన్లైన్లో పొందుపరచాలని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ మండల సంబంధిత అధికారులను మంగళవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మికంగా విచ్చేసి సందర్శించి పరిశీలించారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఎంతవరకు ఆన్లైన్ చేశారని, జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా స్వయంగా సంబంధిత రిజిస్టర్లను, కంప్యూటర్లను కూడ జిల్లా అదనపు కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ప్రజా పాలనలో పథకాలు అమలు కాని వారికి, తెలియని వారికి సైతం తెలిసేలా గ్రామాల్లోని కార్యదర్శుల ద్వారా ప్రజా పాలన పథకాలు అందించేలా ప్రచారం చేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజా పాలన పథకాల దరఖాస్తులను స్వీకరించడంలో, ఆన్లైన్లో దరఖాస్తులను ఆన్లైన్ చేయడంలో, విధుల పట్ల, ప్రభుత్వ పథకాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు చేపడతామని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ మండల పరిషత్ సంబంధిత అధికారులకు హెచ్చరిస్తూ ఆదేశించారు.అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నీటి వసతిని పర్యవేక్షించారు బస్సాపూర్ గ్రామంలో సంపద వానలాలను చూసి పిచ్చి మొక్కలు పెరగకుండా చూడాలని సూచించారు జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ వెంట కె.విజయభాస్కర్ రెడ్డి ఎంపీడీవో , గంగా మోహన్ ఎంపీ ఓ , వినీత్ ఏ ఈ ఆర్ అండ్ బి , శివగంగాధర్ ఏపిఎం ,ధనుంజయ్ టి ఏ ,రవీందర్ టి ఏ మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పంచాయతీ కార్యదర్శి లు రజనీకాంత్ మరియు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఆషాఢమాసం పురస్కరించుకుని పూజలు



కామారెడ్డి జిల్లా , జూలై 30 ( లోకంతీరు ) : శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ శరణం స్వర్ణ యుగశ్రీ కల్కి దేవాలయంలో ఆషాడమాసం మంగళవారం పురస్కరించుకొని శ్రీ సర్వదేవ పరంకరణ పరంజ్యోతి భగవతి భగవాన్లకు శాకంబరీ రూపంలో అలంకరణ చేశారు. అనంతరం సుమారుగా 500 మంది భక్తులకు మహా అన్న ప్రసాదం వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చినం, మాట నిలబెట్టుకుంటున్నము




వేల్పూర్, జులై 30 ( లోకంతీరు ) : ఏకకాలంలో రైతు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వము తోనే సాధ్యమని రైతు సంక్షేమమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు రెండో విడిత లక్ష యాభై వేల రుణమాఫీ ని ఈ రోజు చేసిన సందర్భంగా మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పాటానికి గారి పాలాభిషేకం చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో బాస వేణుగోపాల్ యాదవ్ మాట్లాడడం జరిగింది. రెండో విడతలో దాదాపు 6.40 వేల మంది కి 6.190 కోట్లు లక్షన్నర రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు ఆగస్టు 15 లోపు పూర్తి స్థాయి రుణమాఫీ చేయడం జరుగుతుంది రైతు రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు గత కెసిఆర్ పరిపాలనలో రైతుల పరిస్థితి దీని గాధగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వక పోగా వరేస్తే ఉరి అని రైతుల జీవితాలతో ఆటలకు ఆడుకున్న చరిత్ర కేసీఆర్ దఅన్నారు దేశం లో భాజపా పాలనలో రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలం అయిందన్నారు నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులనడ్డి వీరే చెట్లు బిజెపి పాలన సాగుతుందన్నారు దేశంలో రైతులకు గాని నిరుద్యోగులకు గాని మాట ఇస్తే నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీనే అన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగేలా ప్రవీణ్ డిసిసి కార్యదర్శి తక్కురి దేవేందర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లాకొండ రాజేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బుచ్చి మల్లయ్య. గోపీడీ లింగారెడ్డి ఉట్నూర్ ప్రదీప్, సింగిరెడ్డి శేఖర్, రేవతి గంగాధర్ కుందేటి శ్రీనివాస్ శ్రీరాముల మురళి పూజారి శేఖర్ ,జగదీష్,ఏనుగు మనోహర్ సృజన్,గణేష్ మోహన్ నాయక్, శైలందర్ హన్మాండ్లు అజర్ రంజిత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## వడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఆయకట్టు రైతుల వినతి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జూలై 30 (లోకంతీరు) : కామారెడ్డి జిల్లా సదాశినగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువు రైతులు ఆయా కట్ట రైతులందరూ కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది.అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువు నీటిని కామారెడ్డి పట్టణ తాగు నీటి కోసం తరలిస్తామని మున్సిపల్ అధికారులు ప్రకటించడంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే తమ చెరువు 2000 ఎకరాలకు సాగునీరు అందించవలసిన చెరువు కూడిక నిండడం వల్ల చివరి ఆయకట్టుకు నీరందడం లేదని ఇంకా ఆ చెరువు నుండే 30% నీటిని కామారెడ్డి పట్టణానికి తరలిస్తామని ప్రకటిస్తే ఇక తమ బతుకులు రోడ్డున పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పై జిల్లా యంత్రాంగం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ పెద్ద చెరువు కింద అడ్లూరు ఎల్లారెడ్డి అడ్లూరు, రంగంపేట్, పోసానిపేట్, గొల్లపల్లి, ఇస్రోజివాడి, కన్నాపూర్, రామారెడ్డి, గర్గుల్, గ్రామాల చిన్న సన్నకారు రైతులకు సాగునీరు అందించే ఈ చెరువు నీటిని కామారెడ్డికి తరలించొద్దని అదనపు కలెక్టర్ కు రైతులు కోరడం జరిగింది.రైతుల పొట్ట కొట్టి దౌర్జన్యంగా నీటిని తరలిస్తామంటే ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సింగిల్విండో చైర్మన్లు మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



# సినిమా తీరు

## సంతాన ప్రాప్తిరస్తు ఫస్ట్ లుక్.. ఇదేదో కొత్తగా ఉందే..

ఈ మధ్యకాలంలో టాలీవుడ్ నుంచి ప్రెజెంట్ జెనరేషన్ కి కనెక్ట్ అయ్యే ఇంటరెస్టింగ్ స్టోరీ ఎలిమెంట్స్ తో మూవీస్ వస్తున్నాయి. యూత్ పేస్ చేసే సమస్యలు, వారిలో ఉండే ప్రేమకథలు, అలాగే వారి ఆలోచనలని ప్రతిబింబించే విధంగా దర్శకులు కథలని సిద్ధం చేసి దృశ్యరూపం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి కథలలో మరొకటి టాలీవుడ్ లో రెడీ అవుతోంది. విక్రాంత్ హీరోగా సంతాన ప్రాప్తిరస్తు టైటిల్ తో సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో ఈ సినిమా సిద్ధమవుతోంది. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ ని లాంచ్ చేసి సినిమాని అఫీషియల్ గా ఎనౌన్స్ చేశారు. ఈ సినిమాలో విక్రాంత్ కి జోడీగా చాందిని చౌదరి నటిస్తోంది. మూవీ షూటింగ్ కూడా ఇప్పటికే స్టార్ట్ అయ్యిందని తెలుస్తోంది. ఈ సినిమాలో హీరో విక్రాంత్ సాఫ్ట్ వేర్ కుర్రాడిగా కనిపిస్తాడని తెలుస్తోంది. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ లో విక్రాంత్ చేతిలో హౌ టూ ఇన్ క్రీజ్ స్పెర్మ్ కౌంట్ ఇన్ 100 డేస్ అని రాసి ఉన్న బుక్ ఉంది. అలాగే స్పెర్మ్ కౌంట్ ఇన్ క్రీజ్ చేసుకోవడానికి వాడాల్సిన పండ్లు, కూరగాయలు ఉన్నాయి. మరో చేతిలో విటమిన్ టానిక్స్, యోగా మ్యాట్ ఉన్నాయి.. బ్యాగ్రౌండ్ లో స్పెర్మ్ షేప్స్ డ్రాయింగ్స్ ని ఎస్టాబ్లిష్ చేశారు. వీటిని చూస్తుంటే ఈ జెనరేషన్ లో సాఫ్ట్ వేర్ కుర్రాళ్ళు ఎదుర్కొనే సంతాన సమస్యలని హైలైట్ గా కథని చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ఈ సినిమా కథ ఉండబోతోందని అలాగే మ్యూజికల్ గా కూడా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. ఈ సినిమాకి సునీల్ కశ్యప్ సంగీతం అందించబోతున్నారు. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ సినిమాలకి స్క్రీన్ ప్లే అందించిన షేక్ దావూద్ కథనం ఈ మూవీకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందంట. యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కి కనెక్ట్ అంశాలు చిత్రంలో పుష్కలంగా ఉంటాయని తెలుస్తోంది. ఈ చిత్రంలో విక్రాంత్, చాందిని చౌదరితో పాటు వెన్నెల కిషోర్ అభినవ్ గోమఠం, మురళీధర్ గౌడ్, తాగుబోతు రమేష్, జీవన్ కుమార్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. మధుర ఎంటర్టైన్మెంట్ నుంచి చాలా కాలం తర్వాత వస్తోన్న సినిమా కావడంతో సంతాన ప్రాప్తిరస్తు చిత్రంపై హైప్ క్రియేట్ అయ్యింది.




## డబుల్ ఇస్మార్ట్ ను.. టార్గెట్ చేశారా?

ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి సక్సెస్ చూసిన రామ్ – పూరి ఇప్పుడు సీక్వెల్ గా వస్తున్న డబుల్ ఇస్మార్ట్ తో మరో హిట్ కొట్టడానికి రెడీ అవుతున్నారు. ఈ సినిమా సాంగ్స్ తో ఇప్పటికే మాస్ ఆడియెన్స్ లో మంచి హైప్ క్రియేట్ చేసుకుంది. సినిమా విడుదలకు ఇంకా రెండు వారాలే మిగిలివున్నాయి. ఈ టైమ్ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ చేస్తున్న మేకర్స్ చాలా కాన్ఫిడెన్స్ తో కనిపిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ లోనే సినిమాను విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇదే టైమ్ లో కొన్ని రూమర్స్ కూడా వైరల్ అవుతున్నాయి. ఎంతవరకు నిజం అనే విషయంలో అసలు క్లారిటీ లేదు కానీ సినిమాకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. నైజాంలో ఎగ్జిబిటర్ల వివాదం ఇంకా వేడెక్కిందనే టాక్ వస్తోంది.ఫిలిం ఛాంబర్ నుండి ఇదివరకే మేకర్స్ కు రిలీఫ్ కలిగేలా క్లీన్ చిట్ వచ్చినప్పటికీ, ఎగ్జిబిటర్లకు లైగర్ కు సంబంధించి తగినంత నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారట. నైజాం ఏరియా ఎగ్జిబిటర్లకు ఎనిమిది కోట్ల వరకు రాయితీ ఇవ్వాలట. ఇప్పుడు, లీగల్ గా లయబులిటీ లేకపోయినా, థియేటర్ల యజమానులతో విభేదాలు తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని కథనాలు వస్తున్నాయి. నైజాంలోని థియేటర్ యజమానులు అంతా కలిసి ఇస్మార్ట్ సినిమాను ప్రదర్శించకూడదని నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రచారం నడుస్తోంది. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు ఎవరు అసలు క్లారిటీ ఇవ్వలేదు. ఇక సోషల్ మీడియాలో అయితే డబుల్ ఇస్మార్ట్ ను టార్గెట్ చేశారా? అనే విధంగా కామెంట్స్ వస్తున్నాయి. నిజానికి డిస్ట్రిబ్యూటర్స్ కు డబ్బులు ఇవ్వకుంటే వాళ్ళ థియేటర్లలో ఇస్మార్ట్ పడదు. ప్రముఖ సంస్థల చేతిలోనే 130కి పైగా థియేటర్లు అయితే ఉన్నాయి. మరి ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాలి అంటే మేకర్స్ నుంచి ఒక క్లారిటీ రావాలి. ఇక డబుల్ ఇస్మార్ట్ కు పోటీగా రవితేజ-మిస్టర్ బచ్చన్, విక్రమ్ తగలాన్ సినిమాలు కూడా ఉన్నాయి. థియేటర్స్ పంపిణీ విషయంలో కూడా చర్చలు గట్టిగానే జరిగే అవకాశం అయితే ఉంది. ఇక డబుల్ ఇస్మార్ట్ పై వస్తున్న అనేక రకాల గాసిప్స్ ఆ సినిమాపై హైప్ అయితే తగ్గించలేదు. మరి విడుదల అనంతరం సినిమా ఆడియెన్స్ ను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.




## ఊపిరితిత్తుల ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆహారాల్లో రోజుకు ఏదో ఒక్కటి తినండి చాలు..




పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం మరియు ధూమపానం చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగినందున, ఊపిరితిత్తుల ఆరోగ్యం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మీరు ధూమపానం చేయకపోయినా, వివిధ కారణాల వల్ల వాయు కాలుష్యం అనేక రెట్లు పెరుగుదల ఊపిరితిత్తులకు తీవ్రమైన ముప్పుగా ఉంటుంది, ఇది తీవ్రమైన శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుంది. శరీరం కలుషితమైన గాలికి గురైన తర్వాత, ఆక్సిజన్‌తో పాటు చాలా విషపదార్ధాలు మరియు ఇతర హానికరమైన వాయువులను పీల్చుకుంటారు. ఇది ఊపిరితిత్తుల చుట్టూ శ్లేష్మం అభివృద్ధి చేస్తుంది, దాంతో శ్వాసలో భారము మరియు చిరాకు అనుభూతిని ఇస్తుంది. ఈ శ్లేష్మం శ్వాసకోశ ఆరోగ్యాన్ని మరింత దిగజార్చే వ్యాధికారక మరియు సూక్ష్మజీవులను పట్టుకునే అవకాశం ఉంది. ఆరోగ్యకరమైన శరీరం మరియు మంచి ఆరోగ్యం కోసం స్పష్టమైన, శ్లేష్మం లేని ఊపిరితిత్తులు మరియు వాయుమార్గాల ద్వారా ప్రారంభించబడే ఆరోగ్యకరమైన శ్వాసకోశ వ్యవస్థను కలిగి ఉండటం చాలా ముఖ్యం. కలుషితమైన గాలి మరియు టాక్సిన్స్‌కు గురికావడం వల్ల గుండె మరియు ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరుగుతుంది, ఇది శరీరంలో ఆక్సిజన్ సరఫరాను మరింత ప్రభావితం చేస్తుంది, దాంతో హృదయ సంబంధ వ్యాధులు మరియు శ్వాసకోశ రుగ్మతలకు గురయ్యేలా చేస్తుంది,ఇంకా ఇది మిమ్మల్ని ఉబ్బసం, బ్రోన్కైటిస్ మరియు కొన్ని రకాల క్యాన్సర్లు కూడా గురిచేస్తుంది. ఊఖఆ, తీవ్రమైన వాయుమార్గ రుగ్మత, వృద్ధులలో మరణానికి రెండవ అత్యంత సాధారణ కారణం. గుండె జబ్బులు, ఉబ్బసం, వృద్ధులు మరియు గర్భిణీ స్త్రీలకు కాలుష్యానికి గురికాకుండా ఉండటం చాలా అవసరం. నగరంలోని ఎంత జాగ్రత్తగా నివసించేవారైనా ఇప్పటికే కాలుష్య ముసుగులు ధరించి ఉన్నారు, ఇంటి లోపలే ఉండడం మరియు ఎయిర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించడం వంటి కొన్ని నివారణ చర్యలను అవలంబిస్తుండగా, గాలిలోని టాక్సిన్స్‌తో పోరాడటానికి మరొక సమర్ధవంతమైన మరియు సులభమైన పద్ధతి అనుసరించవచ్చు.కాలుష్యం యొక్క హానికరమైన ప్రభావాలను సమతుల్యం చేయడంలో మరియు ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచడంలో ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వాస్తవానికి, మీ రోజువారీ ఆహారంలో ఈ ఆహారాలను చేర్చడం ద్వారా ఊపిరితిత్తుల నుండి టాక్సిన్స్ (విషాన్ని) ఫిల్టర్ చేయడానికి సహాయపడుతుంది. మన శరీరంలో ఊపిరితిత్తులు అత్యంత ముఖ్యమైన అవయవం. కాబ్టి వాటి రక్షించుకోవడానికి మనం చేయగలిగినదంతా చేయాలి. ఈ వ్యాసంలో, ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచే కొన్ని ఆహార పదార్థాలను మనం చూడబోతున్నాం. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి మరియు వాయు కాలుష్యం మరియు ధూమపానం ప్రభావాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ఈ ఆహారాలను ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకోవాలి. మీ ఊపిరితిత్తులను సహజంగా శుభ్రపరచడంలో మీకు సహాయపడే 9 ఆహారాల జాబితా ఇక్కడ ఉంది..గ్రీన్ టీగ్రీన్ టీధూమపానం ద్వారా పొగ పీల్చడం వల్ల ఊపిరితిత్తులు ఇన్ఫ్లమేషన్ కు గురి కావడం చాలా సహజం. గ్రీన్ టీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు పొగను లోపలికి పీల్చడం వల్ల ఊపిరితిత్తులు పాడకుండా కాపాడటానికి ఈ గ్రీన్ టా సహాయపడుతుంది. నీళ్ళునీళ్ళు నీటి కంటే ఏది మంచిది? మీ శరీరం చక్కగా పనిచేయడానికి నీరు ఉత్తమ మార్గం, ఆరోగ్యానికి సంబంధించిన అన్ని సమస్యలకు ఒక నివారణ నీరు తీసుకోవడం. ఈ పర్యావరణ పరిస్థితులలో నీరు మరియు ద్రవాలు తీసుకోవడం గతంలో కంటే ఇప్పుడు చాలా అవసరం. శరీరం నుండి అన్ని విషపదార్థాలను సహజంగా బయటకు పంపబడానికి నీరు త్యంత ప్రభావవంతమైన సాధనం. కాబట్టి రోజూ ఆరు నుంచి ఎనిమిది గ్లాసుల నీరు త్రాగాలి. పసుపుపసుపుపసుపు చాలాకాలంగా వైద్యంలో ఉపయోగించబడింది. దానిలోని అన్ని ఔషధ లక్షణాలకు కారణం కర్కుమిన్. దీని యాంటీఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు క్యాన్సర్‌కు వ్యతిరేకంగా ప్రభావవంతంగా ఉంటాయి.

## నేషనల్ క్రష్ అంటే ఆవిడ ఫీలైందా?

నేషనల్ క్రష్ అంటే అందరికీ గుర్తొచ్చేది రష్మిక మందన్నా. అమ్మడికి 'పుష్ప' తర్వాత వచ్చిన గుర్తింపు అది. అంతవరకూ అమ్మడి ట్యాలెంట్ కేవలం సౌత్ కే పరిమితమైంది. 'పుష్ప' విజయం పాన్ ఇండియాలో సంచలనమవ్వడంతో రష్మిక రేంజ్ మారింది. ఆ రకంగా అప్పటి నుంచి నేషనల్ క్రష్ గా ఫేమస్ అయింది. అటుపై బాలీవుడ్ లోనూ సినిమాలు చేయడంతో రష్మికకి తిరుగులేని తార అన్న ట్యాగ్ ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఏకంగా అక్కడి స్టార్ హీరోలతోనే సినిమాలు చేస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్లకు అమ్మడు ఇంకా అడుగు దూరంలోనే ఉంది. సల్మాన్ ఖాన్ తో సికందర్ లో నటిస్తోంది. అలాగే మరికొంత మంది యంగ్ హీరోలకు జోడీగా నటిస్తోంది. ఇలా ఉత్తరాదిన రష్మిక జర్నీ సాగుతోంది. సరిగ్గా ఇదే సమయంలో ఇటేవలే నేషనల్ క్రష్ అంటూ హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రి కూడా తెరపైకి వచ్చింది. ఆరేడు సినిమాలు చేసినా రాని గుర్తింపు ఒకే ఒక్క యానిమల్ తో పాన్ ఇండియాలో దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయం తరువాత త్రిప్తీ చాలా కొత్త ప్రాజెక్ట్ లకు సైన్ చేసింది. బాలీవుడ్ అంతటా బాబిగా ఫేమస్ అయింది. ఆ క్రేజ్ తో మరిన్ని అవకాశాలు వస్తున్నాయి. తాజాగా కొన్ని రోజుల క్రితమే ఈ బ్యూటీని కూడా నెటి జనులు నేషనల్ క్రష్ అంటూ కొత్త పిలుపు మొదలు పెట్టారు. అంతవరకూ బాబిగా హైలైట్ చేసిన జనం కొత్తగా నేషనల్ క్రష్ అనడం ఆసక్తికరంగా మారింది. గతవారమైతే ఏకంగా ట్రెండింగ్ లోనే నిలిచింది. అయితే త్రిప్తీని ఇలా సంబంధించడంపై రష్మిక ఫీలవుతుందనే టాక్ వినిపిస్తుంది. తనకి మాత్రమే సొంతమైన ట్యాగ్ తో మిగతా నటుల్ని ఎలా పిలుస్తారు? అనే అంశాన్ని తన పీఆర్ టీమ్ వద్ద ప్రస్తావిం చిందిట. దీంతో రష్మిక ఈ విషయంలో కాస్త అసంతృప్తిగానే ఉందనిపిస్తుంది. మరి ఈ ట్యాగ్ ని పర్మినెంట్ చేసుకోవడం అంటే ఎలా? అంటే అందుకు ఛాన్స్ లేదు. నెటి జనులు ఇచ్చిన ట్యాగ్ కి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఉండదు. అదే ట్యాగ్ పరిశ్రమ గుర్తించి ఇస్తే అవకాశం ఉంటుంది. త్రిప్తీ నటించిన 'యానిమల్' లో రష్మిక మందన్న రణబీర్ కి భార్య పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.



## అందానికే మరో అందం....






## అంపైర్ నిర్ణయంపై ఆగ్రహం.. వేలు చూపిస్తూ, క్రీజు వీడని క్రికెటర్.. కట్‌చేస్తే.. బిగ్ షాకిచ్చిన ఐసీసీ



ఐర్లాండ్ వర్సెస్ జింబాబ్వే మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అదే సమయంలో యువ బ్యాట్స్‌మెన్ హ్యారీ టెక్టర్ మ్యాచ్ సమయంలో అంపైర్ నిర్ణయాన్ని ఎదిరించినందుకు, అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించారు.ఆటగాళ్లు, ఆటగాళ్ల మద్దతు సిబ్బందికి సంబంధించిన ఎఅఅ ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1ని ఉల్లంఘించినందుకు అనుగుణంగా జరిమానా విధించింది.ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరో ఓవర్‌లో టెక్టర్ వికెట్ వెనుక క్యాచ్ అవుట్ అయినట్లు అంపైర్ ప్రకటించారు. అయితే, 24 ఏళ్ల ఆటగాడు అంపైర్ నిర్ణయాన్ని వ్యతిరేకించాడు. అంపైర్ వైపు వేలు చూపిస్తూ మైదానం వీడకుండా అక్కడే ఉండిపోయాడు.అయితే, ఇది 24 నెలల వ్యవధిలో టెక్టర్ చేసిన మొదటి నేరంగా పేర్కొన్నారు. అంటే అతని క్రమశిక్షణా రికార్డుకు కేవలం ఒక డీమెరిట్ పాయింట్ మాత్రమే జోడించారు. ఈ కేసులో ఎటువంటి విచారణ అవసరం లేదు. ఎందుకంటే బ్యాట్స్‌మన్ నేరాన్ని అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రోవ్ ప్రతిపాదించిన పెనాల్టీని అంగీకరించాడు. మ్యాచ్‌లో టెక్టర్ ప్రదర్శన చాలా నిరాశపరిచింది. అతను 4 పరుగులు మాత్రమే చేయగలిగాడు.జింబాబ్వేను ఓడించి ఐర్లాండ్ టెస్ట్ ఫార్మాట్‌లో తన రెండో మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 210 పరుగులకు ఆలౌటైంది. రిప్లై ఇన్నింగ్స్‌లో పీటర్ మూర్ హాఫ్ సెంచరీ (79) సాయంతో 250 పరుగులు చేసి 40 పరుగుల ఆధిక్యం సాధించింది.ఆ తర్వాత, డియోన్ మైయర్స్ (57) అర్ధ సెంచరీ సహాయంతో పర్యాటక జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 197 పరుగులు చేసింది. ఐర్లాండ్‌కు 158 పరుగుల విజయ లక్ష్యం ఉంది. ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ చేసి ఐదుగురు బ్యాట్స్‌మెన్‌లను కేవలం 21 పరుగుల వద్ద పెవిలియన్‌కు పంపారు.ఆ తర్వాత, కెప్టెన్ లోర్కాన్ టక్ (56), ఆండీ మెక్‌బ్రైన్ (55×) బాధ్యతలు స్వీకరించారు. అర్ధ సెంచరీ ఇన్నింగ్స్ ఆడి తమ జట్టును 4 వికెట్ల తేడాతో గెలిపించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. వరుసగా 7 టెస్టు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన ఐర్లాండ్.. చివరి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

## పల్లెటూరి కబడ్డీ.. ప్రపంచ స్థాయి మార్కెట్‌గా ఎలా ఎదిగింది ? ద జర్నీ ఆఫ్ కబడ్డీ

కికెట్ తప్ప వేరే ఆట తెలియదన్నట్లుగా వ్యవహరించే మన దేశంలో సంచలనాలు సృష్టిస్తున్న గేమ్ కబడ్డీ లీగ్. ఒక గ్రామీణ క్రీడకు కమర్షియల్ హంగులు అద్ది..ఆ ప్లేయర్స్‌ను కూడా కోటీశ్వరులను చేస్తోంది. మంచి యాక్షన్, డ్రామా, థ్రిల్లింగ్ మూవ్‌మెంట్స్‌తో క్రీడా ప్రపంచంలో కబడ్డీ మార్మోగిపోతోంది. రూరల్ ఇండియాలోనే కాదు.. అర్బన్ స్పోర్ట్స్ లవర్స్‌ను కూడా ఆకట్టుకుంటోంది.31కి పైగా దేశాల్లో ఆడుతున్న ఐపీఎల్ తర్వాత అత్యధిక మంది చూసే లీగ్‌గా పీకేఎల్ ఎదిగింది. ఇప్పటికే 10 సీజన్లు పూర్తి చేసుకొని 11వ సీజన్‌కు సిద్ధమవుతున్న ఈ పీకేఎల్.. ప్రతి సీజన్‌కూ తన బ్రాండ్ వాల్యూను పెంచుకుంటూ వెళ్తోంది. 2014లో తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ ప్లేయర్స్ వేలం జరిగింది.అప్పటి వరకూ క్రికెట్‌లో ఐపీఎల్ ప్లేయర్స్ వేలం చూసిన అభిమానులను ఈ కబడ్డీ వేలం పెద్దగా ఆకర్షించలేకపోయింది. ఐపీఎల్‌లో స్టార్ క్రికెటర్లను కోట్లు పెట్టి కొన్నాయి ఫ్రాంచైజీలు. అదే కబడ్డీ లీగ్ తొలి సీజన్‌లో ఓ ప్లేయర్ పలికిన అత్యధిక మొత్తం ఎంతో తెలుసా? కేవలం రూ.12.8 లక్షలు. ఈ మొత్తమే అప్పట్లో కబడ్డీ ప్లేయర్స్‌కు చాలా ఎక్కువ. అప్పటి ఇండియన్ కబడ్డీ టీమ్ కెప్టెన్ రాకేశ్ కుమార్ ఈ ధర పలికాడు. కానీ, ప్రస్తుతం కబడ్డీ వేలం కోట్లలోకి చేరింది. ఖఐఅ 10 వేలంలో మొత్తం ముగ్గురు రైడర్లు మిలియనీర్లు అయ్యారు. ఒక్కో ఆటగాడికి కోట్లలో ధరపెట్టి కొనుగోలు చేస్తున్నాయి ఫ్రాంచైజీలు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.